
# పెన్నకు వరద రావాలి

## 'సుషమ'



'**జననీ** జన్మ భూమిశ్చ స్వర్గా దపి గరీయ సీ!' అని ఉత్తినే అనలేదు. నా విషయంలో అది మరింత ఎక్కువేమో ననిపిస్తుంది. నాకు పుట్టిన ఊరు 'తాడిపత్రి' అంటే ఎనలేని అభిమానం. ఇప్పుడు నిజానికి హైదరాబాదే నా ఊరు. అక్కడే నా నివాసం. అక్కడే ఉద్యోగం. నా నేస్తాలు అందరూ అక్కడే ఉన్నారు. నేను నా వృత్తి విద్య డాక్టరు కోర్సు అయిదేళ్ళూ అక్కడే చదివాను. అయినా, అయినా ఆ తాడిపత్రి అంటే నాకేమిటో వెర్రి అభిమానం. ఆ మాటే అన్నాను ఓ మారు నా కొలీగ్‌తో.

'పిచ్చి! ఏముందోయ్ తాడిపత్రిలో! పగిలిపోయిన బీడు నేలల గుండెలు... ఎండిపోయిన పెన్నానది ఇసుక నదీ ప్రవాహాలు... శిథిల మయిపోయి పునరుద్ధరణ క్కూడా నోచుకోని దేవళాలు...'

నిజమే! అతడు చెప్పిన వేవీ నేను కాదనలేను. ఎక్కడ చూచినా దాహంతో పగుళ్ళు బారి, నీటి కోసం నోటిని తెరచి ఆశగా ఆకాశాని కేసి చూసే చౌటి నేలలే అక్కడ. కానీ, పగిలిపోయిన గుండెల్లో నుంచి కూడా వెలికి పారే కంటికి కనిపించని ఆ నెనరు తేనియలను అతను చూడలేడు. ఇసుక పర్రలు కాదు ముఖ్యం. ఆ పవిత్ర పినాకినీ నదీ సైకత శ్రేణుల అట్టడుగున కూడ పెట్టుకుని ఉన్న తరతరాల సంస్కృతి? ఆ పెన్నానదిలో నిలుచుని నేటికీ ఆ నాటి శిల్పకారుల పనితనాన్ని చూపుతున్న దేవాలయాల్లోని శిల్ప కళా వైభవం శిథిలమయి పోయినా...! పైగా ఆ పెన్నానది... పెన్న... పెన్న...!

పెన్న అన్న పదం వింటే చాలు, నా గుండె అప్పుడే చిగిర్చిన లేచిగురుటాకు చల్లని పిల్లగాలికి రెపరెప లాడినట్లు ఊగిపోతుంది. ఆ పెన్న ఒక ఏటికి పేరుగా మాత్రమే నాకు తోచదు. అది ఎండిన, పగిలిన నిస్సహాయ హృదయాంతరాలోంచి సుధాస్రవంతులను చిందించడానికి వచ్చిన మరో దేవతా రూపంలా కనిపిస్తుంది.

మీకు చెప్పనే లేదు కదా? బాగుంది మరి. చెప్పంది మీకెలా తెలుస్తుంది? నిజానికి పెన్న గురించి మీకు చెప్పాలంటే మిమ్మల్ని రెండు, రెండున్నర దశాబ్దాల కిందికి తీసుకువెళ్ళాలి. నేను అప్పటి కింకా ఆరేళ్ళ వాడిని. ఆరేళ్ల వాడినే అయినా ఇప్పటికీ అప్పటివి అన్నీ గుర్తే నాకు. ఆ వీథి బాగా గుర్తు. వీథిలోని మనుషులందరూ గుర్తే. మనుషుల పేర్లు గుర్తే. వీథి పేరు గాజుల కిష్టప్ప వీథి. నాన్నగారు స్కూలు టీచరుగా చేసే వారు. ఆ వీథి దాటి ఎడమవైపుకు మళ్ళి కాసింత దూరం వెడితే, "మూ ళ్ళాందర్ల"కు ముందుగా, కొత్తగా అప్పుడప్పుడే కట్టిన మునిసిపల్ ఆఫీసు. దానికి ఎదురుగుండా వీథిలో, వీథి కెదురుగా స్కూలు. వీథికి కుడి పక్కన కొసలో చెట్టుకింద లింగయ్య అనే చెప్పులు కుట్టుకునే వాడు.

'ఒరేయ్, లింగిగా!'

లక్ష్మీకాంతుడు లక్షాధికార్ల అబ్బాయి.

'కాంతూ!' అన్నా న్నేను.

'ఏఁ వాయ్?'

'తప్పు. అంత పెద్ద మనిషిని పట్టుకుని 'రా' అంటావా? కళ్ళు పోత్తై. పాపం వస్తుంది!'

'ఎవడూ! వీడు... ఈ చెప్పులు కుట్టేవోడు పెద్ద మనిషా...!'

రమణా, శివుడూ, ద్వారకా, రంగనాథ అందరూ

ఎగతాళిగా నన్ను గేలి పట్టించేవాళ్ళే. అటు పక్కన ఆ లింగయ్య తాత. ఇటు పక్కన నేను తల వంచేసుకున్నాం సిగ్గుతో.

'అమ్మా!' అన్నాను రాత్రి అమ్మ పక్కకు చేరి. తాడిపత్రిలో వర్షాకాలం. చలికాలం చాలా తక్కువ. ఆరేడు నెలలకు పైగా ఇంట్లో పడుకోరు సంవత్సరంలో. ఆరుబయట వీథిలో మంచం పక్కన మంచం వేసుకుని పడుకున్నాము. దూరంగా ఎరుకల వెంకటమ్మ బొంగురు గొంతుతో మెల్లిగా పాడుతోంది- 'ఏ కులమని నన్నివర మడిగితే ఏమని చెప్పుదు లోకంలకూ...' అని.

'ఊఁ. ఏమిట్నాన్నా?'

'చెప్పులుకుట్టే వాళ్ళంటే?' అడిగాను ఉదయం జరిగిన లక్ష్మీకాంతుని విషయం చెప్పాక.

'అవున్నాన్నా! అదో కులం- అంటరాని కులం అని సంఘం వెలివేస్తే బతకలేక. నోరులేక. పైకిరాక అట్టడుగున పడి ఉన్న కులం!'

అమ్మ అందరి లాంటిది కాదు. అమ్మ పేరుకు మాత్రమే విశాల కాదు. ఆమె హృదయం కూడా విశాలమే! ఆమె ప్రాపులో. పెంపకంలో ఈనాడు నాయకుల మనుకునే వాళ్ళు వల్లవేసే మాటల్లోని సారాంశాన్నానాడే నేను నేర్చేసుకున్నాను.

'తాతా!'

లింగయ్యను ఆ తాడిపత్రి మొత్తంలో ఎవరూ అలా 'తాతా' అని నోరారా గౌరవంగా అంతవరకు పిలవనే లేదు కాబోలు. నేను అలా వరసపెట్టి ఆప్యాయంగా పిలిచే సరికి తలెత్తి కుడుతోన్న పాత చెప్పుని పక్కనే ఉన్న పాత మూకుడులోని సలువు. ఎరుపురంగుల కలయికగా ఉన్న నీళ్ళలో ముంచి ఉంచేసి నాలిక వెళ్ళబెట్టి నన్ను ఆశ్చర్యంగా చూచేడు. ఆ కళ్ళలో కనిపించిన ఆశ్చర్యం. ఆనందం నేనెన్నడూ మరచి పోలేనివి.

'నీ కూతురా?' తాత పక్కనే కూచుని ఉన్న ఓ చిన్నారిని చూపించి అడిగేను. తాతకు నోట మాట రావటం లేదు. తలాడించేడంతే.

'ఏం చదూతున్నావ్?'

వయసులో నా సరిసమానమో. లేక నా కన్నా ఒక ఏడాది చిన్నో ఉంటుం దంతే. చక్కని ముక్కు- అందమయిన ముఖం—చిన్న పెదాలు... నల్లని ఒత్తయిన జుత్తు సంస్కారం లేక చింపిరిగా- ఎర్రగా ఉంది. తెల్లని పలువరస... అంతా కలిసి ముద్దుగా ఉంది.

ఆ పిల్ల నవ్వింది...! ఆ నవ్వులో ఎన్ని భాష్యాలు? ఆ పిల్లపై అదే ఇది కలిగింది నాకు. అది అభిమానమా? అట్టడుగు జాతి వారిని ఆదరించే ఆదర్శమా? అయినా ఆదర్శమనేంత పెద పెద్ద పదాలు వాడి నన్ను నేను గొప్ప చేసుకోటానికి నా వయసెంత అనీ? అసలు అలా రెండు కులాలున్నాయనే తెలీయదు నా వయసుకు. అది నిశ్చయంగా ఆదర్శం గాదు. కేవలం మనిషికీ. మనిషికీ మధ్య ఉన్న అభిమానం. పరిధులు గీసుకుని. పగలు పెంచుకుని దూర దూరంగా ఉంటున్న వారికి అర్థంగాని. మరపులో పడిపోయిన పసి మనసుల అనురాగం అది! ఆకర్షణ అది. అభిమానం అది.

'నీ పేరు?'

'పెన్న...!'

పెన్న ...! అప్పుడంతగా ఆలోచించలేదు గానీ. ఇప్పుడాలోచిస్తే అనిపిస్తుంది ఎంత చక్కని పేరు అని! మనుమల గుండెల్లో మన చుట్టూ ఉన్న చెట్టూ. పుట్టా. ఏరూ. వాగూ వంకలాటి ఎంత అభిమానమో. ఆ అభిమానం ఎలా చూపించుకోవాలో ఇప్పుడు తెలుస్తుంది.

అమ్మయినా అనగలదేమో కానీ. ఆదర్శం విషయంలో నాన్న గారికి దీటు రారెవరూ. అందుకే ఆయన్ని అందరూ దూరంగా ఉంచేవారు. ఆయన ఇచ్చిన ధైర్యంతోనే పెన్నను పట్టుపట్టి స్కూల్లో చేర్పించాను.

'పెన్నా...!'

'ఏం చిన్నయ్యా?'

పెన్న నన్నెప్పుడూ 'చిన్నయ్యా' అనే పిలిచేది.

'ఈసారి ఆన్యువల్ ఎగ్జామ్స్...!'

'ఊఁ.'

'నీకు అన్నింటిలో సెంట్‌పర్సెంట్ రావాలి.'

పెన్న మాటాడేది గాదు. ఆమెకు బాగా తెలుసు. తనకు బాగా మార్కులు వస్తయ్యని. అలా అని ఎప్పుడు విడవకుండా కష్టపడి బాగా చదువుతుందా అంటే అదీ లేదు.

'అసలు చదవనిస్తేగా నన్నూ!' అని అనేది పెన్న.

'అదేం? ఎందుకు చదవనివ్వరూ ?'

'చదవనివ్వరు! అంతే !'

'అదే! ఎందుకూ అంట!' కోపంగా అన్న నన్ను క్షణంపాటు అదో మాదిరి చూచి లిప్త సేపు ఆగి అంది- 'చిన్నయ్యా!' నీకేమీ తెలియదు. నీకేమీ తెలీదు. చిన్నయ్యా.'

'అవున్నాకేమీ తెలియదు. నేను మొద్దుని. తెలివిలేని వాణ్ణి. శుంఠని. నీవు... నీవే జాణవు.'

నన్నూ. నా ఆవేశాన్నీ చూస్తూ నవ్వేది. ఆ కోపంలో నేను బావుంటానుట. నన్నలా చూడటం ఆమె కెంతో ఇష్టమనేది.

'నేను పని చేయొద్దేమిటి?' అనేది ఆఖరికి నన్నూరడిస్తూ.

'అంత పనేమిటమ్మా!'

'ఆఁ. అన్నర్లే గానీ...జనార్దనమయ్యవారు...'

'మాట తప్పించకు...నీవు చేయాల్సిన పనేమిటో చెప్పు.

'నేను చెప్పలేను...'

'చెప్పితీరాల్సిందే...!'

'ఛీ ఛీ. చిన్నా! నీకు తెలీదు. వివరా లడక్కు-

'అంతేనా? చెప్పవూ?' అన్నా దీనంగా. చెప్పలేనంటున్న పెన్నని బలవంత పెట్టి. ఇరుకున పెట్టి జవాబు విన్నాక గానీ, ఆ కులం వాళ్ళు అంత నీచాతి నీచమైన పని చేస్తారని తెలిసొచ్చింది గాదు నాకు. ఆ షాక్‌లోంచి నేను తేరుకోలేక పోయాను చాలా సేపటిదాక.

'చిన్నా ! నా మీద అసహ్యం వేస్తోంది కదూ?' జాలిగా పలికిన ఆ మాట విన్నాక నా కెందుకో సంఘం మీద కోపం వేసింది. సమాజం మీద మంట పుట్టింది. సాటివారి మీద ద్వేషం కలిగింది. వ్యవస్థ మీద అసహ్యం పుట్టింది. ఆ వ్యవస్థలో ఇరుక్కుపోయిన నా మీద నాకే విరక్తి కలిగింది.

'ఇంకోటి చెప్పనా. చిన్నా ?'

నా ముక్కు పుటాలు కోపంతో. ఆవేశంతో ఎగురుతున్నై.

'నేను చదువుకోటం కూడా మా గూడెంలో వాళ్ళకు ఇష్టం లేదు.'

'ఇష్టం లేదా?'

'ఊఁ! అందుకే నన్నూ,మానాన్ననూ వెలేసినట్లు చూస్తుంటారు.'

ఆ మాటలు నాకు మరచి పోలేనివి. ఆమె ఉంటూన్న ఆ గూడేనికి పోయి, ఓ పర్యాయం అందరినీ దులిపి రావాలనిపిస్తుంది. మఖ్యాలుగా ఉదయం పూట పెన్న వాళ్ళ వాళ్ళ అందరిలాగే గంప నెత్తిన పెట్టుకుని ఊరిలోని మైల శుభ్రం చేయాలట. ఛ..! ఛ..! నా స్నేహంలో, నేను ఆ చిన్నారి బుర్రలో ప్రవేశపెట్టిన విప్లవ జ్వాలల వేడితో ఓ రోజు పోనంటూ మొండికేసిందట. ఆనాడు ఆ పెన్నతల్లిని చావబాదారట. నాలుగు రోజులు లేవలేక పోయిందట. చావు దెబ్బలమూలంగా.

'మూర్ఖులు...' అన్నాన్నేను ఆమె కలిగిన ఆ బాధని ఒకే ఒక్క మాటలో వెలిగక్కుతూ.


ఎంతటి గాయమైనా కాలం మాన్పేస్తుందట. నెమ్మదిగా అలవాటు పడిపోయింది పెన్న ఆ దెబ్బలకు.

ఎస్సెసెల్సీ పాసయిపోయిన రోజున ఇంటికి వచ్చి ఆ సంతోషం పట్టలేక భోరుమని ఎంత సేపు ఏడ్చిందో... నన్నూ, నాన్ననూ, అమ్మనూ ఎన్నెన్ని విధాల పొగిడిందో...!

సరిగ్గా ఆ సమయంలో లింగన్న తాత బాగా అనారోగ్యంతో తీసుకున్నాడు. జబ్బేమో తెలియదు. మందులు వేయించుకోడు. డాక్టరుకు అసలు చూపనే చూపరు. చూపించుదామని నెత్తీ నోరూ కొట్టుకుని పోరిన పెన్న మాటని పూర్తిగా తోసిపుచ్చారు. లింగయ్యనే వద్దన్నాడు. ఫలితంగా లింగయ్య ఈ లోకాన్నే వదలిపెట్టి వెళ్ళిపోయాడు. తండ్రిపోయిన ఆ దుఃఖంలో పెన్న నిర్ణయించుకున్నట్లుంది తను డాక్టరు కావాలని. అంతే! ఆ మొండి పట్టుదలతో తన నిర్ణయం నెరవేర్చుకుంది. కష్టపడింది. శ్రమించింది- అటు చదువులో, ఇటు సంఘంలో.

నేనూ, నాన్నా తీసుకున్న జాగ్రత్త మరెవరైనా తీసుకుంటారు. ప్రపంచం విశాలమైంది. ఆదర్శమూర్తులు ఎందరో? దేశం గొడ్డుపోలేదు. కానీ, ఆమె కృషి...? ఆమె కృషి మెచ్చుకోతగ్గది.

పెన్న అంటే నా కెప్పటి నుంచో ఇష్టం. తనంటే నేనిలా ఇష్టంగా ఉన్నానని ఆమెకు మాత్రం తెలియదా ? కాలేజీలో చదివే రోజుల్లో ఓసారి అనుకోకుండా పెన్న దగ్గరకు చేరి. ఆమెను స్పృశించడం జరిగింది.



'చిన్నా!' నన్నూ, నా కళ్ళులోని ఆరాధన నూ చూసింది పెన్న.

'పెన్నా.'

'వద్దు, చిన్నా!... మీరు బ్రాహ్మలు!'

'అయితే...?'

'నీకు తెలియదు ,చిన్నా ! ప్లీజ్...!'

'ఏది ? ఏమిటి ? ఏమిటి నాకు తెలియంది?'

'చిన్నా? నేను... నేను...'

ఆమె మనసులో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉన్నట్టుంది. నేను ఉన్నత కులం, తాను నీచకులం అనే భావన ఉంది.

'పెన్నా ! నేను నిన్ను...'

'ఊఁహూఁ! చిన్నా,వద్దు.'

'పోనీ నీకు నేనంటే...!'

'చిన్నయ్యా... ప్లీజ్ ! నన్నలా అడిగి ఇబ్బంది పెట్టకు! దైవం మీద ఇష్టం ఉండదా ? కానీ, చిన్నా ! నా ధ్యేయం వేరు. ఆశయం వేరు. ఆశ వేరు. నన్ను ఈ ప్రలోభాలకు లొంగిపోనీకు...'

నిజమే. అప్పుడు పెన్న ధ్యేయం డాక్టరు కావడం ! తనలో ఇటువంటి ఊహాలు రేపటం సమంజసం కాదు. అది ఆమె పట్టుదల కో దెబ్బ... అది అప్పటి మాట. ఇప్పుడో... ఇప్పుడు తను డాక్టరు. నేనూ డాక్టరునే. నాకు డాక్టరును చేసుకోవాలని ఉంది.

పెన్నను చేసుకోవాలంటే నాకు నా పరమైన కౌటుంబికమైన సమస్యలేవీ అడ్డు రాకూడదు. అమ్మ దగ్గరకు చేరే నందుకే.

'చిన్నా! డాక్టరు వయిపోయేవు' అంది అమ్మ.

'అమ్మా ! అది మీ ఆశీర్వాదాల ఫలమేనమ్మా !'

'భగవంతుని కృప.' ఆ కన్నుల్లో కనిపించిన తృప్తి చాలు- ఆ ఆనంద పారవశ్యం చాలు. ఆర్తిగా దగ్గరకు చేర్చుకుని నన్ను చిన్న పిల్ల వానికి మల్లె జుత్తులో వేళ్ళు పోనిచ్చి నా నొసట ముద్దు పెట్టుకుంది.

'అమ్మా !' సంశయిస్తూ ఉండిపోయాను.

'చూడు, చిన్నా !నీ సంశయం కేవలం గౌరవం కోసమే అయితే సరే !నేనెన్నడూ నీ భావాలకీ, నీ ఆశయాలకీ అడ్డు రాలేదు. రాను కూడా. కాకపోతే నీ గుండెలో ఉన్నతమైన భావాలు కలగాలనీ, ఆ విధంగా కలగటానికి కావలసిన అవకాశాలు కల్పించాను. నా పెంపకంలో నాకు నమ్మకముంది. నీవు ఏదీ కానిదాన్ని కోరుకోవు. చెప్పు, నాన్నా ! ధైర్యంగా అడిగెయ్.'

అమ్మ చెప్పింది నిజమే ! అయినా ఎందుకో ఫలానా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని చెప్పుకోటానికి డెలికసీ అడ్డు వచ్చింది.

'పెన్న...' అన్నాను అప్పటికీ...

'తెలుసు, నాన్నా ! అర్థమయిపోయింది. నీ ఇష్టానికి నేనెన్నడూ కాదనను. నీ ఆనందం, నీ సౌఖ్యం, నీ సంతోషం కదా మా క్కావలసింది. అందుకోసం కదా నిన్ను ఇన్ని కష్టాలకి ఓర్చి పెంచింది. ఇప్పుడు నీ ఇష్టాన్ని కాదని, నిన్ను వ్యథకు గురి చేస్తే మేము చూడగలమా? పైగా నీవు చిన్న వాడివి కాదు. మంచి చెడ్డలు చూచి అర్థం చేసుకోగలవు.'

అమ్మా, నాన్నా లాంటి అభ్యుదయ వాదులు, ఆదర్శవాదులు ఎక్కడా ఉండరనుకుంటాను. ఆ ధైర్యంతోనే తాడిపత్రిలో నే ఉండిపోయిన పెన్నకి నా అభిప్రాయాన్ని తెలిపి, వీలయితే ఏకంగా చేయి పట్టుకుని వెంట నడిపించుకుని రావాలని, అమ్మ కాళ్ళమీద పడిపోవాలని బయలుదేరాను తాడిపత్రికి.

పెన్న తనున్న చోటుననే గుడిసెలాంటి ఒక చిన్న ఇంటిలో తన డిస్పెన్సరీని తెరిచింది. ఆ గుడిసె చుట్టూ ఇసుక వేస్తే రాలనంత జనం. అంతా పేదలే. ఆ పేదలందరూ ఆమె కులానికి చెందిన వాళ్ళే. ఆ బీదరికం, ఆ దీన దృక్కులు, ఆ విచిత్ర రోగాలు... డాక్టరునయిన నాకే ఎంతో అసహ్యం వేసింది. స్టెరిలైజ్ చేసిన ఇంజక్షన్ తీసుకుని ఎముకల గూడులాంటి ఓ ముసలివగ్గు శరీరంలో


"జీవితంలో ఆమె పోరాటాన్ని అతను తన పోరాటంగా స్వీకరించాడు.
అదే వారిద్దరి అనుబంధం అయింది."

యద్దనపూడి సులోచనారాణి

కలం నుండి మరో నవల

'మనోభిరామం'

వెలువడింది!

వెల: రూ.15/-

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

యివి పునర్ముద్రణలు!

| | |
|---|---|
| సెక్రటరీ | 25=00 |
| అనురాగగంగ | 22=00 |
| కలలకౌగిలి | 22=00 |
| అభిశాపం | 20=00 |
| ఆరాధన | 12=00 |
| ఆత్మీయులు | 12=00 |
| జాహ్నవి | 18=00 |
| శ్వేతగులాబి | 18=00 |

ఈ పుస్తకాల కోసం మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేతని అడుగండి! లేవంటే తెప్పించి పెట్టమనండి. కాదంటే మీకు కావల్సిన పుస్తకాల మొత్తం ధరలో 1 రూ. తగ్గించి ఎమ్.వో. చేయండి ఆ 1 రూ.కి V.P. పోస్టులో పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ 3237 రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ 500 003




కండను వెదుకుతూ నన్ను చూసింది పెన్న. నవ్వలేదు. 'హలో' అనలేదు. కానీ. అంతకు మించిన మరో మహత్తరమైన ఆదరాన్నీ. ఆహ్వానాన్నీ ఆ కన్నుల్లో నన్ను చూడగానే మెరిసిన మెరుపులో చూసేను.

'పెన్నమ్మా ! నీ కోసరం వచ్చినట్లున్నారు- చూడు!'

అయినా పెన్న రాలేదు. అయిదు నిమిషాలయింది. పదిహేను... అర గంట... గంట అయింది. అప్పటిగ్గానీ ఆమెకు తీరిక చిక్కలేదు.

'చిన్నయ్యా !' ఆ స్వరంలో ఎన్ని ఆప్యాయతలు... ఎన్ని అనురాగాలు... ఎన్ని అనుబంధాలు...

'ఓహ్ ! రోరింగ్ ప్రాక్టీసు ...! బాగానే ఉంది. కానీ...!'

'ఊఁ! ఆగినావేం?'

'చిన్నగా అడుగుతున్నావా ? వాళ్ళూ... వాళ్ళ వాసనలూ... వాళ్ళ బాసలూ.. యాసలూ... ఊసులూ... ఓహ్ !'

'అవును. చిన్నా ! వాళ్ళు మావాళ్ళు. అట్టడుగున పడిపోయిన జాతికి చెందిన వాళ్ళు ! వాళ్ళకు సంఘం ఏం అవకాశమిచ్చింది బాగుపడటానికి ? దరిద్రం- అనారోగ్యం- అస్పృశ్యత...! హుఁ! చాలు. ఈ మూడు చాలు. వీళ్ళని ఇంకో మూడు తరాల ఊబిలోనికి పూడ్చి గట్టిగా తొక్కిపారెయ్యడానికి. చదువు లేదు. సంస్కారం లేదు. సభ్యత తెలియదు. సమాజం వేసిన చింకి చాప మీద దూరంగా కూచున్న వాళ్ళు...!

'పెన్నా!' అన్నాన్నేను. 'కాదు- నీవు అలా కాదు. నీవు వేరు.'

'ఏం? నేనూ ఆ సమాజంలోనుంచి వచ్చిందాన్నే. ఆ బురద గుంటల్లో. ఆ భరించరాని దుర్గంధాల్లో నించి బయట పడిందాన్నే.'

ఎంతో చెప్పాను. పెళ్ళి చేసుకోమన్నాను. నన్ను పెళ్ళి చేసుకుంటే...

'చేసుకుంటాను. చేసుకుంటే ఏమవుతుందో చెప్పు? నేను హాయిగా ఉంటాను. నా పిల్లలు శుభ్రంగా కాన్వెంటులో చదువుతారు. చక్కని తిండి తిని. హాయిగా. ఆరోగ్యంగా. అందంగా నవ్వుతూంటే నీవూ. నేనూ దూరం నించి చూస్తూ... ఈ అనాథలూ...? ఈ అనాథలూ. అభాగ్యులూ అల్లల్లాడిపోతూనే ఉంటారు. వీళ్ళ మూర్ఖత్వం అట్లాగే ఉంటుంది. మొండితనం అలాగే ఉంటుంది. చదువు లేక పోవటంతో తమ చుట్టూ ఉన్న బావి మాత్రమే తప్ప మరో లోకం ఉందని తెలియక...తెలియక్కాదు-తెలుసుకోరు. అనారోగ్యంతో చస్తారు. తమ వాళ్ళను చంపేస్తారు. అంతేకానీ. సరయిన వైద్యం చేసుకోరు.

'దీనికీ. పెళ్ళికీ ఏమిటి సంబంధం?'

'సంబంధం పెళ్ళితో కాదు-మనుషులతో. వీళ్ళకు మీలాంటి అమృతమూర్తులు. ఆదర్శ పురుషులు ఎన్నో ప్రయత్నాలు. అవకాశాలు ఇచ్చారు. అయినా వీళ్ళ పరిస్థితి మెరుగుపడలేదు.'

'అయితే నీవు కంకణం కట్టుకుంటావా?'

'నీవు ఊఁ అంటే? చూడు. చిన్నా! అప్‌లిఫ్ట్ కావాలంటే మొదట మనిషికి ఎగ్జిస్టెన్స్ కావాలి. జీవిక కావాలి. అవి ఉండాలంటే ఆరోగ్యం కావాలి. ఆరోగ్యానికి సరయిన వైద్యం ఉండాలి. వీళ్ళు నవ్యతనీ. విప్లవాన్నీ ఏ విధంగానూ అంగీకరించరు. వీళ్ళు నా వాళ్ళు. అన్ని చోట్ల అందరూ ఇలాగే ఉన్నారో. లేదో తెలియదు. కానీ. వీళ్ళు ఇంతే. వీళ్ళు నా వివాహాన్ని ఇంకొకరితో అంగీకరించరు. వాళ్ళతో నాకేమిటీ అని తెగతెంపులు చేసుకుని రావచ్చును. వస్తే ఇందాక చెప్పినట్లు నేను సుఖంగా ఉంటాను. కానీ ఇంత చదువుకున్న మన యువతరమే స్వార్థంతో ఉంటే. ఈ పరుగు పందెంలో ఎప్పటికీ రాకుండా వెనకగా పడిపోయి ఉన్న వీళ్ళని ముందు కెవరు తీసుకువస్తారు? చెప్పు. చిన్నా? కీర్తికోసం కాదు. అయినా మీరు ఏ కీర్తి నాశించి నన్నింతదాన్ని చేసేరు కనుక? ఉన్నత కులానికి చెందిన మీరు అస్పృశ్యులుగా ఎంచబడుతున్న నన్ను అన్ని ఆటంకాలనీ కాదని పైకి తీసుకు వచ్చినప్పుడు నా వాళ్ళను నేను పైకి తీసుకురాలేక పోతే. ఇంతకు మించిన దారుణం. అన్యాయం ఉండదు. తప్పదు. కొన్ని కొన్ని విప్లవాలకు కొందరు కొందరు ఇలా త్యాగం చెయ్యవలసిందే. అందుకే నీవు ఒప్పుకుంటే నేను ఇలాగే వీళ్ళ దగ్గరే ఉండిపోదామని అనుకుంటున్నాను.'

నేను నిలుచుకుని ఉండగానే నా ముందరే ఆమె ఇంతై. ఇంతింతై విరాట్స్వరూపం ధరించినట్లు ఎంతో పైకి ఎదిగిపోయింది.

"మాబావ లింగిని పెళ్ళి చేసుకుంటున్నాను. ఈ పెళ్ళితో నేను వాళ్ళలో ఒకదాన్నయిపోతాను. నా మందులూ. నా వైద్యమూ వారికి నచ్చుతున్నాయి ఇప్పుడిప్పుడే. ఇది రోగమని. రోగానికి మందు ఉందని. నాకు ఆ మందుల వివరాలు తెలుసునని వీళ్ళకు అర్థమవుతూంది. వాళ్ళలో ఆ మెంటాలిటీని డెవలప్ చేస్తాను. ఇంకో దశాబ్దానికయినా రావలసినంత మార్పు రాకపోతే పోయింది. కనీసం అందులో అయిదో వంతు వస్తే...'

పెన్నకి వరద రావాలి. ఆ ఇసుక పర్రలు సుళ్ళు తిరుగుతూ పరుగులు తీసే చల్లని నీటి ప్రవాహంతో నిండిపోవాలి. ఆ జన జీవన విధానంలో ఆనందం పరవళ్ళు తొక్కాలి. ఆ తాడిపత్రిలో...కనీసం ఆ తాడిపత్రిలోనైనా ఆ జనంలో చైతన్యం కలిగితే...వాళ్ళ మేధల్లో కరుడు గట్టుకుని నిలిచిపోయిన ఆ చీకటి నల్ల పెచ్చులు విజ్ఞానపు వెలుగు రేఖలతో చిట్లిపోతే. ఆరోగ్యం శారీరకంగానే గాక మానసికంగా కూడా కలిగితే...

'ఏమంటావ్. చిన్నా!'

'ఊఁ. ఈ కొట్టం పక్కనే నేను బోర్డు కడతాను. ఆ ప్రజల్లో విశ్వాసం కలిగించే నీ కృషికి నేను తోడ్పడతానంటాను. ఏమంటావ్?' పెన్నను వదలి ఉండాలంటే నా మనసు ఒప్పుకోదు మరి.

'చిన్నా!' అంది పెన్న.

పెన్న కళ్ళలో వరదలా కన్నీళ్ళు...కాదు-ఆనందబాష్పాలు పైకెగసి పడ్డాయి. నా కళ్ళు బాధతో జలజలా కన్నీటిని కార్చింది. అదో విచిత్ర సంగమం! '